రంజాన్ వేళలు
ఇఫ్తార్ : సోమవారం
సా.. 6.30 గం॥
సహర్ : మంగళవారం
ఉ..5.05 గం॥


లక్ష్మీనరసింహస్వామిని సూర్యవాహనంలో ఊరేగిస్తున్న భక్తులు

కోటంచ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వైభవంగా ప్రత్యేక పూజలు

రేగొండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోటంచలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రా రంభమయ్యాయి.ఈ సందర్భంగా ప్రధాన అర్చకుడు బుచ్చమాచార్య ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి అభిషేకాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని డప్పు చప్పుళ్ల, భక్తుల నృత్యాలు, గోవింద నమస్మరణల మధ్య సూర్య వాహనంలో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని శేషవాహనంలో చేర్చి మాడ వీధుల్లో ఊరేగించారు. బ్రహ్మో త్సవాల మొదటి రోజు ఆదివారం రావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మహేష్, ఆలయ చైర్మన్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

మండలికి 'రాములమ్మ'

- ఎమ్మెల్యే కోటాలో విజయశాంతికి అవకాశం
- స్వగ్రామంలో ములుగు జిల్లా రామన్నగూడెంలో సంబరాలు



ములుగు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సినీ నటి, రాజకీయ నాయకురాలు విజయశాంతిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించింది. ఎమ్మెల్యే కోటాలో ఆమెకు ఈ అవకాశాన్ని కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో ఆమె మూలాలు మరోసారి తెరపైకి వచ్చాయి. 2005లో తల్లి తెలంగాణ పార్టీని స్థాపించిన తొలిరోజుల్లో తన స్వస్థలం ములుగు జిల్లాలోని ఏటూరునాగారం మండలం రామన్నగూడెంగా విజయశాంతి ప్రకటించుకున్నారు. తాను చెన్నైలో పుట్టి పెరిగినప్పటికీ తన పూర్వీకులు రామన్నగూడెంలో నివాసం ఉండేవారని తెలిపారు. సినీరంగంలో అగ్ర కథానాయికగా కొనసాగుతూ అభిమానుల చేత రాములమ్మగా పిలవబడుతున్న ఆమె.. రాజకీయ రంగంలోకి అడుగుపెట్టిన తర్వాత తన స్వస్థలంపై చేసిన ప్రకటన అప్పట్లో సంచలనం కలిగించింది. స్వయంగా రామన్నగూడెం వచ్చిన విజయశాంతి స్థానికులతో మమేకమయ్యారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, బీజేపీలో చేరిన తర్వాత ఆమె పలుమార్లు ములుగుకు వచ్చారు. ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తాజాగా కాంగ్రెస్ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా విజయశాంతిని ప్రకటించడంతో రామన్నగూడెంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం, ఎమ్మెల్యేల సంఖ్యాబలం చూసుకుంటే విజయశాంతి గెలుపు దాదాపు ఖరారైనట్లేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


మహారాష్ట్ర సరిహద్దుల్లోని మహాదేవపూర్‌లో పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ రేషన్ బియ్యం వాహనాలు (ఫైల్)

చిట్యాల మండల కేంద్రంలో రహస్యంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం బ్యాగులు (ఫైల్)

దర్జాగా దోపిడీ!

భారీగా రేషన్ బియ్యం రీసైక్లింగ్

- పకడ్బందీ వ్యూహంతో మిల్లర్ల దందా
- సీఎంఆర్ ధాన్యాన్ని పక్కదారి పట్టించి రేషన్ బియ్యంతో సర్దుబాటు
- సేకరణ కోసం విస్తృత నెట్‌వర్క్ ఏర్పాటు
- కళ్లు మూసుకున్న పౌరసరఫరాల శాఖ
- మొక్కుబడి దాడులతో సరిపెట్టుకుంటున్న టాస్క్‌ఫోర్సులు
- జిల్లాలో రూ.కోట్లలో సాగుతున్న అక్రమ వ్యాపారం

(భూపాలపల్లి, ఆంధ్రజ్యోతి)

పేదల బియ్యం పక్కదారి పడుతోంది. రేషన్ డీలర్ల ద్వారా మిల్లులకు చేరి రీసైక్లింగ్ అవుతోంది. ఆ తర్వాత సీఎంఆర్ రూపంలో తిరిగి ప్రభుత్వానికే ధాన్యాన్ని అంటగడుతూ మిల్లర్లు దర్జాగా దోపిడీకి పాల్పడుతున్నారు. భూపాలపల్లి జిల్లాలోని 32 రైస్ మిల్లుల్లో సగానికి సగం ఈ రకం దందాలోనే మునిగి తేలుతున్నాయి. ఫలితంగా పేదల బియ్యం కాస్త వ్యాపారులకు మేతగా మారుతోంది. నిన్న మొన్నటి దాకా రేషన్ బియ్యం పొరుగు రాష్ట్రాలకు భారీగా తరలివెళ్లేది. అయితే.. స్మగ్లింగ్‌పై పెద్ద ఎత్తున ఆరోపణలు రావడంతో అటు రెవెన్యూ, ఇటు పోలీసు యంత్రాంగం దాడులు ముమ్మరం చేయడంతో అంతర్రాష్ట్ర స్మగ్లర్లు కాస్త వెనుకంజ వేశారు. అయినా స్థానిక వ్యాపారులు మాత్రం ఎలాంటి జంకుబొంకు లేకుండా రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తూ ప్రభుత్వ ఖజానాకు భారీగా కన్నం పెడుతున్నారు. ఇలా గత ఏడాది కాలంలో భూపాలపల్లి జిల్లాకు సంబంధించి దాదాపు రూ.200 కోట్ల మేర పేదల బియ్యం చేతులు మారినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కేవలం పోలీసులు జరిపిన దాడుల్లోనే దాదాపు 2,500 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడిందని లెక్కలు చెబుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆహార భద్రత లక్ష్యంగా పేదలకు రూపాయికే కిలో బియ్యం ఇస్తున్న విషయం తెలిసిందే. భూపాలపల్లి జిల్లాలో 99శాతం (1,23,497)పైగా రేషన్‌కార్డులు ఉండగా వారందరికీ ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున రేషన్ బియ్యం అందుతోంది. అయితే, ఇందులో చాలా మంది లబ్ధిదారులు రేషన్ బియ్యం తినేందుకు ఇష్ట పడకపోవడం దళారులకు వరంగా మారుతోంది.


టేకుమట్లలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని సేకరించి తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్‌కు చిక్కిన దళారులు (ఫైల్)

దందా సాగుతోంది ఇలా..

రేషన్ బియ్యం తీసుకునేందుకు ఇష్టపడని వినియోగదారులను లక్ష్యంగా చేసుకొని దళారులు రేషన్ షాపుల వద్దే అక్రమాలకు తెరలేపుతున్నారు. భూపాలపల్లి జిల్లాకు సంబంధించి మొత్తం 1.23 లక్షల రేషన్ కార్డులుండగా, ఇందుకు ప్రతి నెలా 19 వందల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని 277 రేషన్ షాపుల ద్వారా పంపిణీకి కేటాయిస్తున్నారు. అయితే దొడ్డు రకం బియ్యాన్ని లబ్ధిదారులు వినియోగించేందుకు పెద్దగా ఇష్టపడటం లేదు. దీన్ని అసరాగా చేసుకుంటున్న దళారులు చాలా చోట్లా నేరుగా డీలర్లతో సంబంధాలు ఏర్పరుచుకొని బియ్యాన్ని సేకరిస్తున్నట్లు చెబుతున్నారు. బియ్యం తీసుకోని వినియోగదారులకు డీలర్లు కిలోకు రూ.10 చొప్పున చెల్లించి బ్రోకర్లకు రూ.14 చొప్పున అంటగడుతున్నారు. ఇదిలా ఉంటే మరో వైపు కొంతమంది దళారులు గ్రామాల వారీగా తిరిగి ఏజెంట్ల ద్వారా సేకరించిన బియ్యాన్ని బ్రోకర్లు సీఎంఆర్ కేటాయింపులు కలిగిన రైస్ మిల్లులను, అంతర్రాష్ట్ర స్మగ్లర్లను సంప్రదించి కిలో రూ.18 చొప్పున విక్రయిస్తున్నట్లు తేలింది. ఇలా ప్రతి నెలా భూపాలపల్లి జిల్లా పరిధిలో దాదాపు 5వేల క్వింటాళ్ల బియ్యం చేతులు మారుతోందని తెలుస్తోంది. మిగతా పరిమాణంలో మరో 30 శాతం (సుమారు 300 మెట్రిక్ టన్నుల) మేరకు పొరుగున ఉన్న మహారాష్ట్రకు అక్రమ మార్గాల గుండా తరలివెళ్తోంది. స్థానికంగా కిలోకు రైస్

(మిగతా 8వ పేజీలో)

క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులను పరిశీలించాలి

- వేసవిలో నీటి ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు చేపట్టాలి
- మేడారం మహాజాతరకు సౌకర్యాలను మెరుగుపర్చాలి
- సమీక్ష సమావేశంలో అధికారులతో మంత్రి సీతక్క



సమీక్ష సమావేశంలో ఇంజనీరింగ్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి సీతక్క


పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించడంతోపాటు నిర్ణీత సమయంలోపు పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీ ణాభివృది శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ టీఎస్.దివాకర, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌లతో కలిసి ఇంజనీరింగ్ అధికారులతో ఆదివారం సమావేశమై సమీక్షించారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని, కిందిస్థాయి నుంచి ఉన్నత అధికారుల వరకు ప్రతి పనిని పరిశీలించాలని సూచించారు. గ్రామాల్లో చేపడుతున్న పనితోపాటు జిల్లా స్థాయిలో చేపడుతున్న పనులను సంబంధిత అధికారులు నిత్యం పరిశీలిస్తూ నాణ్యతతో కూడిన పనులను పూర్తి చేయాలని అన్నారు. 163వ జాతీయ రహదారి 100 కిలోమీటర్లు ఉండడంతోపాటు గోదావరి పరీవాహక ప్రాంతం 100 కిలోమీటర్లు ఉందని, పలు ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖల ద్వారా చేపట్టిన పనులను నాణ్యత లోపించకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రస్తుత వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా సంబంధిత అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఐటీడీఏ ద్వారా చేపట్టిన అభివృద్ధి. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రానున్న మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భక్తులకు సౌకర్యాలను మెరుగుపర్చాలని సూచించారు. పలు రకాల పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు నిర్ణీత సమయంలో పనులు పూర్తిచేయని పక్షంలో చర్యలు తప్పవన్నారు. వేసవికాలం ముగిసేవరకు జిల్లాలోని పలు గ్రామాలకు పలు శాఖల ద్వారా చేపట్టిన పనులను రెండునెలల కాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. గ్రామాల్లో మంచినీటిని సరఫరా చేసే ట్యాంకులను శుభ్రం చేయాలని, గ్రామాల్లోని చెరువులు,కుంటల్లో సాగు, తాగునీరు అనుకూలంగా ఉండేవిధంగా పనులు చేపట్టాలన్నారు. సమీక్ష సమావేశంలో ఆర్డీవో వెంకటేశ్, ఆర్అండ్‌బీ, పీఆర్, ట్రైబల్ వెల్ఫేర్, నేషనల్ హైవే, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

ములుగు జిల్లాలో 163వ జాతీయ రహదారి ఉన్నందున రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పోలీసులు కృషిచేయాలని మంత్రి సీతక్క అన్నారు. జిల్లాకేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌ను ఎస్పీ శబరీశ్, కలెక్టర్ టీఎస్.దివాకరతో కలిసి ఆమె ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో పోలీస్ అధికారులతో సమావేశాలు నిర్వహించేందుకు కాన్ఫరెన్స్ హాల్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. మహిళలపై జరిగే నేరాలలో నేరస్థులతో కఠినంగా వ్యవహరించాలని, జిల్లాలో రోడ్డు భద్రత, మత్తు, మాదకద్రవ్యాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ములుగు అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీ రవీందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎల్అండ్‌టీ రోడ్డుపై ఇసుక లారీలతో ఏర్పడిన ట్రాఫిక్‌జామ్

ఇష్టారాజ్యం

- ఇసుక లారీలతో భారీగా ట్రాఫిక్ జాం
- ఎల్అండ్‌టీ రోడ్డుపై విచ్చలవిడిగా పార్కింగ్
- చేల వద్దకు వెళ్లేందుకు రైతులకు ఇబ్బందులు

మహదేవపూర్ రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : బొమ్మాపూర్, ఎల్కేశ్వరం, అంబట్‌పల్లి ఇసుక క్వారీలకు వచ్చే లారీలతో ఆదివారం ఎల్అండ్‌టీ రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. కుదురుపల్లి నుండి మేడిగడ్డ వరకు ఉన్న ఈ రహదారిపై లారీలను ఇష్టారీతిన పార్కింగ్ చేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వందల సంఖ్యలో వస్తున్న లారీలను టీజీఎండీసీ సిబ్బంది సైతం నియంత్రించకుండా వదిలేస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మిరప చేలకు కూలీలను తీసుకెళ్లేందుకు కూడా రోడ్డుపై ఖాళీ లేకపోవడంతో కిలోమీటర్ల మేర నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతి రోజూ ఇసుక లారీలతో ఇదే సమస్య ఎదరవుతున్నా పట్టించుకునేవారే లేరని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నియంత్రించాలని కోరినా..

ఎల్అండ్‌టీ రోడ్డుపై ఇసుక లారీలను నియంత్రించాలని బ్రహ్మణపల్లి, బొమ్మాపూర్ రైతులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఇటీవల ఇసుక క్వారీల్లో పర్యటించిన భూగర్భజల, గనుల శాఖ ప్రధాన కార్యదర్శి ఎన్.శ్రీధర్ లారీలను నియంత్రించడంతో పాటు ప్రత్యేక పార్కింగ్ పాయింట్ ఏర్పాటు చేయాలని ఆదేశించి నప్పటికీ పట్టించుకోక పోవడం చర్చనీయాశంగా మారింది. ఈ లారీల కారణంగా 15 రోజుల క్రితం బ్రహ్మణపల్లికి చెందిన కూలీల ట్రాక్టర్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. దీంతో రైతులు, కూలీలు రోడ్డుపై ఆందోళనకు దిగినప్పటికీ లారీలను నియంత్రించే చర్యలు చేపట్టకపోవడం పట్ల అసహనం వ్యక్తమవుతోంది. దీనికితోడు లోకల్ పేరుతో ఒక్కో లారీకి రూ.1000 నుంచి రూ.2వేల వరకు వసూలు చేస్తూ లారీలను ప్రత్యేక మార్గాల్లో అనుమతిస్తుండటంతో ట్రాఫిక్‌జామ్ మరింత పెరుగుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. లోడింగ్ నిమిత్తం వచ్చే లారీలు ఇబ్బడిముబ్బడిగా వెళ్తుండటంతో సమస్య మరింత జఠిలమవుతోంది. టీజీఎండీసీ ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి లారీల రాకపోకలను నియంత్రించాలనే డిమాండు సర్వత్రా వినిపిస్తోంది. ఇసుక క్వారీల్లో అదనపు బకెట్ కట్టడి చేసినట్టుగానే లారీల నియంత్రణను కఠినతరం చేయాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా రాజు


బండారి రాజు

మొగుళ్లపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన బండారి రాజు నియమితులయ్యారు. ఈమేరకు ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ జాతీయ చైర్మన్ మామిడి సుదర్శన్, రాష్ట్ర చైర్మన్ పులిగిల్ల బాలయ్య ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర వైస్ చైర్మన్ నత్తి కొర్నెల్ తెలిపారు. ఈసందర్భంగా రాజు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసేందుకు దశల వారీగా ఉద్యమాలు చేస్తూ ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడానికి జిల్లాలోని ఎస్సీ సోదరులను సంఘటితం చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

బాలిక కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు

- ఇద్దరు యువకుల అరెస్టు
- సాంకేతిక పరిజ్ఞానంతో గంటల వ్యవధిలోనే పట్టివేత


నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ, ఎస్సై

కాటారం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన బాలికను మాయమాటలతో కిడ్నాప్ చేసి కారులో తీసుకెళ్లిన యువకుడు, సహకరించిన అతడి స్నేహితుడిని కాటారం పోలీసులు చేశారు. బాలికను ఎత్తుకెళ్లి ఆమె కుటుంబ సభ్యులను, పోలీసులను ఏమార్చడానికి చేసిన యత్నాలను సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఆటకట్టించారు. కాటారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై అభినవ్‌తో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను సీఐ నాగార్జునరావు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం మల్కాపురం గ్రామానికి చెందిన 20 ఏళ్ల పొల్ల వేణుకు ఇన్‌స్టాగ్రామ్‌లో కాటారం మండల కేంద్రానికి చెందిన 16 ఏళ్ల బాలిక పరిచయమైంది. దీంతో ఆమెను ట్రాప్ చేసిన వేణు తన స్నేహితుడు దిశాంత్‌తో కలిసి కారులో శనివారం మధ్యాహ్నం కాటారం వచ్చాడు. బాలికను పెళ్లి చేసుకుంటానంటూ మాయమాటలు చెప్పి ఆమెను కారులో ఎక్కించుకుని వెళ్లాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు లబోదిబోమంటూ పోలీస్‌స్టేషన్‌కు పరుగుపరుగున వెళ్లారు. బాలికను కారులో కిడ్నాప్ చేసి తీసుకెళ్తున్నారని పోలీసులకు తెలిపారు. దీంతో డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు ఆదేశాల మేరకు ఎస్సై అభినవ్ రెండు టీంలను ఏర్పాటు చేసి కిడ్నాప్ చేసిన వ్యక్తుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానం సాయంతో బాలికను తీసుకెళ్తున్న కారును గుర్తించి జాతీయ రహదారి వెంట ఉన్న పోలీస్‌స్టేషన్లను అప్రమత్తం చేశారు. బాలికను హైదరాబాద్ వైపు తీసుకెళ్లకుండా యువకులు కారును ఖమ్మం వైపు తీసుకెళ్తుండగా ఐటీకోర్ పోలీసుల సాయంతో టెక్నాలజీని ఉపయోగించి నిందితులను తొర్రూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుకున్నా రు. దీంతో నిందితులైన వేణు, దిశాంత్‌పై పోక్సో, కిడ్నాప్ కేసులు నమోదు చేశారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. బాలికను భరోసా కేంద్రానికి పంపించినట్లు వెల్లడించారు.

గంటల వ్యవధిలోనే కిడ్నాప్ కేసును ఛేదించి నిందితులను పట్టుకున్న సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్, ఐటీ కోర్ పీసీ వేణు, సైబర్‌వింగ్ పీసీ స్వామి, కాటారం పీఎస్ కానిస్టేబుళ్లు జంపన్న, లక్ష్మీరాజు, సాంబశివరావు, లవణ్, హోంగార్డ్ తిరుపతి, డబ్ల్యూపీసీ రజనితో పాటు మిగతా సిబ్బందిని డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అభినందించారు.

భూపాలపల్లిలో బీసీ జేఏసీ ర్యాలీ


పట్టణంలో బైక్ ర్యాలీ చేస్తున్న బీసీ జేఏసీనాయకులు

భూపాలపల్లిటౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బీసీ జేఏసీ ఆధ్వర్యంలో భూపాలపల్లిలో ఆదివారం బైక్ ర్యాలీని నిర్వహిం చారు. పట్టణంలోని పలు ప్రధాన వీధుల మీదుగా ఇది కొనసాగింది. బీసీల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో తీర్మార్ మల్లన్న టీం జిల్లా కమిటీ నాయకుడు రవిపటేల్ మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారం దక్కే దిశగా ఈ ఆందోళన, చైతన్య ర్యాలీల ప్రదర్శన చేస్తున్నామని తెలిపారు. బీసీలను ఐక్యం చేస్తూ గ్రామగ్రామానా తిరుగుతున్నామని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు గడిచినా బీసీలకు రాజ్యాధికారం దక్కలేదని అన్నారు. అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే బీసీలు అధికారంలోకి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శేఖర్‌నాని, రాజ్, రమేష్, మహేందర్, శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట


రాఘవపట్నంలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి సీతక్క

- పథకాల్లో తొలి ప్రాధాన్యం కల్పిస్తున్నాం..
- పురుషులకు సమానంగా ఉద్యోగావకాశాలు
- రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. కలెక్టర్ టీఎస్.దివాకర, ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, అదనపు కలెక్టర్ సంపత్ రావుతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా కేంద్రంలో ఈనెల 5, 6 తేదీల్లో మహిళా ఉద్యోగులకు 16 రకాల క్రీడా పోటీలు నిర్వహించగా విజేతలకు మంత్రి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడారు. రాష్ట్రంలోని మహిళలకు అన్నిరంగాల్లో ప్రాధాన్యత ఇవ్వడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకచొరవ చూపుతున్నారన్నారు. మహిళల హక్కుల సాధన కోసం నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. కష్టాల్లో ఉన్న మహిళా కుటుంబాలను ఆదుకోవడానికి పలు నిర్ణయాలు తీసుకుంటున్నారని, మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆర్థికంగా ఎదగడానికి ఇందిరమ్మ మహిళా క్యాంటీన్ ఏర్పాటు చేయడం, పెట్రోల్ పంపులు, రైస్‌మిల్లులు, సోలార్ పవర్ తయారీ, ఆర్టీసీ బస్సులతోపాటు పలు రంగాల్లో అభివృద్ధి చెందడానికి ఆర్థిక సాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో పురుషులతో సమానంగా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారన్నారు. ఇప్పటికే 37శాతం మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించినట్టు తెలిపారు. ఎక్కడాలేని విధంగా రూ.21వేల 635కోట్లతో మహిళా సంఘాల గ్రూపులకు నిధులు కేటాయించి పలు పథకాల్లో భాగస్వామ్యం చేశామని, డ్వాక్రా గ్రూపు మహిళలు ప్రతి నెల రూ.5లక్షల ఆదాయం పొందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా మంత్రి సీతక్క కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో వెంకటేశ్, డీడబ్ల్యూవో శిరీష, జిల్లాలోని వివిధ శాఖల మహిళా ఉద్యోగులు, టీజీవో, టీఎన్‌జీవో సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం ఇందిరమ్మ పథకం

గోవిందరావుపేట(ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని నిరుపేదలందరికీ ఇళ్లు నిర్మించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకాన్ని ప్రవేశపెట్టిందని మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆదివారం మండలంలోని రాఘవపట్నం గ్రామపంచాయతీ పరిధిలోని ఇప్పలగడ్డ గ్రామంలో రూ.5లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి ఆమె కలెక్టర్ దివాకర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగానే ములుగు జిల్లాలో మొదటిసారి ఇందిరమ్మ ఇళ్ల పథకం నమూనా నిర్మాణం కోసం శంకుస్థాపన చేశామన్నారు. మోడల్ హౌస్‌ను పరిశీలించి తక్కువ ధరతో నాణ్యతతో ఇల్లు ఎలా కట్టాలో పేదలు పరిశీలించి తమ స్థలాల్లో నిర్మించుకోవాలని సూచించారు. రాబోయే నాలుగేళ్లలో పేదవాడి సొంతింటి కల నెరవేర్చే దిశగా ఇందిరమ్మ ఇళ్ల యాప్ ప్రారంభించుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులలో అర్హులైన దరఖాస్తులను ఎంపిక చేసి మొదటి విడతగా ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. ప్రతి దశలో ఇంటి నిర్మాణ పురోగతి వివరాలు ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జవహర్‌రెడ్డి, తహసీల్దార్ సృజన్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


వివిధ పోటీల్లో గెలుపొందిన గ్రామపంచాయతీ సిబ్బందికి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న మంత్రి సీతక్క


రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు

రామప్ప ఆలయంలో సందడి

వెంకటాపూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో భక్తులు, విదేశీయుల సందడి నెలకొంది. ఆదివారం వారాంతపు సెలవు కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు, విదేశాలకు చెందిన పర్యాటకులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఈ సందర్భంగా రామలింగేశ్వర స్వామిని దర్శించుకోగా అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వారు ఆలయ శిల్పకళా సంపదను వీక్షించి ఆనందం వ్యక్తంచేశారు. ఆలయ చరిత్ర, విశిష్టత గురించి గైడ్‌లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సరస్సు వద్దకు చేరుకుని బోటులో విహరిస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ఆనందంగా గడిపారు.

మేడారంలో భక్తుల కోలాహలం


వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

తాడ్వాయి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఆదివారం కోలాహలం కనిపించింది. వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వారాంతపు సెలవు కావడంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణ కట్టలో తలనీలాలు ఇచ్చారు. భక్తిశ్రద్ధలతో తల్లుల గద్దెలకు చేరుకొని పూలు, పండ్లు, చీరె సారె, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు ఎత్తు బంగారం(బెల్లం), యాట మొక్కులు సమర్పించుకున్నారు. సుమారు 15వేల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

తాగేందుకు గుక్కెడు నీళ్లు కరువు

వనదేవతలను దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు గద్దెల పరిసరాల్లో తాగేందుకు గుక్కెడు నీళ్లు లేవని ఆరోపిస్తున్నారు. దర్శనాల సమయాల్లో ముడుపులు, ఎత్తు బంగారం(బెల్లం)తో వృద్ధులు, పిల్లలు, మొక్కులకు రాగా తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి.


ప్రవీణ్‌కుమార్‌తోపాటు కుమారుడు, కూతురు అంతిమయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్థులు

ముగిసిన ప్రవీణ్‌కుమార్ అంత్యక్రియలు

నెల్లికుదురు(మహబూబాబాద్ జిల్లా), మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని ఎస్సారెస్పీ కాలువలో కారు పడి, కొట్టుకపోయి మృతి చెందిన ప్రవీణ్‌కుమార్, చైత్రసాయి, సాయివర్ధన్‌ల అంత్యక్రియలు స్వగ్రామం మేచరాజుపల్లిలో ఆదివారం జరిగాయి. ప్రవీణ్‌కుమార్, చైత్రసాయి, సాయివర్ధన్ మృతదేహాలకు శనివారం వరంగల్ ఎంజీఎంలో పోస్టుమార్టం నిర్వహించి, అనంతరం స్వగామం మేచరాజుపల్లికి తీసుకువచ్చారు. గ్రామస్థులు మృతదేహాలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి చెందిన వార్త విని సుదూర ప్రాంతాల నుంచి బంధువులు, స్నేహితులు తరలివచ్చి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ముగ్గురి మృతదేహాలను స్వర్గరథంలో గ్రామశివారు చెరువు వద్దకు తీసుకవెళ్లారు. ప్రవీణ్‌కుమార్ తండ్రి సోమారపు సారంగపాణి ముగ్గురికి తలకొరివి పెట్టి, చితికి నిప్పంటించి అంత్యక్రియలు పూర్తిచేశారు.


ప్రవీణ్‌కుమార్ చితికి నిప్పంటిస్తున్న తండ్రి సారంగపాణి

న్యాయ కళాశాల ఏర్పాటు చేయకపోతే ఉద్యమిస్తాం


సదస్సులో అభివాదం తెలుపుతున్న సంఘం నాయకులు

వెంకటాపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో న్యాయ కళాశాల ఏర్పాటు చేయకపోతే ఉద్యమిస్తామని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ న్యాయ కళాశాల ఏర్పాటు న్యాయమైన డిమాండ్ అని, న్యాయ కళాశాల సాధించుకునేవరకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదిమ తెగలను విస్మరిస్తున్నాయని, దేశంలో అత్యధికంగా అన్యాయానికి గురయ్యేది ఆదిమ తెగలేనని అన్నారు. ఆదివాసీలపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వాలు ఎందుకు స్పందించడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అదేవిధంగా బాండ్ మొక్కజొన్న రైతులకు న్యాయం జరిగేలా చూడాలని, వారి తరఫున పోరాడుతామని అన్నారు. ఈ సదస్సులో నాయకులు పాయం సత్యనారాయణ, కొర్స నర్సింహమూర్తి, ఉయిక శంకర్, పైపతి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

అగ్గి అంటుకుంటే ఆహుతే..!

- పదేళ్లుగా డిమాండ్‌గానే తొర్రూరు ఫైర్‌స్టేషన్
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు

తొర్రూరురూరల్(మహబూబాబాద్ జిల్లా), మార్చి 9(ఆంధ్రజ్యోతి): వేసవి కాలం అంటేనే అగ్ని ప్రమాదాలకు నెలవుగా ఉంటుంది. అలాంటిది ఎక్కడో ఒక్కచోట ప్రమాదవశాత్తు అగ్గి అంటుకుంటే అంతా ఆహుతి కావాల్సి వస్తోంది. అగ్ని ప్రమాదాలు జరిగితే ఫైరింజన్ సకాలంలో వస్తే ప్రమాదాలను నివారించవచ్చు. కానీ, తొర్రూరు, పెద్దవంగర మండలాల్లో ఏ మారుమూల గ్రామంలో అగ్నిప్రమాదం జరిగినా ఫైరింజన్ కోసం గంటల కొద్దీ ఆగాల్సిందే. అయినా వస్తుందనే నమ్మకం లేదు. తొర్రూరు మునిసిపాలిటీ, డివిజన్ కేంద్రంగా మారి పదేళ్లయినా ఇక్కడ పూర్తిస్థాయిలో కార్యాలయాలు కూడా లేకపోవడం విడ్డూరం. ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి ఉన్న తొర్రూరు, పెద్దవంగర ప్రాంతాల్లో వేసవిలో నిప్పు అంటుకొని గడ్డివాములు, ఇళ్లు, వ్యవసాయ పొలాలు కాలిపోవడం లాంటివి జరుగుతున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు పరామర్శించడానికి ప్రజాప్రతిధులువచ్చి వెళ్తుంటారు. అగ్ని ప్రమాదాలను నియంత్రించడానికి ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రజలు, రైతులు పదేళ్లుగా డిమాండ్ చేస్తున్నా ఎక్కడి గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. కనీసం ప్రజల గోడు వినే నాయకుడే లేడంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంగా ఉన్న మహబూబాబాద్‌తో పాటు మరిపెడ మండలంలో మాత్రమే ఫైరింజన్లు ఉన్నాయి. ఎక్కడ అగ్నిప్రమాదం జరిగినా రెండు కేంద్రాల నుంచి మాత్రమే ఫైరింజన్లు రావాల్సి ఉంటుంది. వేసవికాలం కావడంతో ఎక్కువగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో అటు వైపు వెళ్తుంటాయి. తొర్రూరుకు వస్తుందనే నమ్మకం లేదు. ప్రతీ స్టేషన్‌కు 40 కిలోమీటర్ల దూరంలో తొర్రూరు ఉండడంతో వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నుంచి అదృష్టం ఉంటే గంట తరువాత వస్తదని, లేదంటే అంతా అగ్నికి ఆహుతి కావాల్సిందేనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


వెల్లికట్టెలో జీపీ ట్యాంకర్‌తో మంటలు ఆర్పుతున్న సిబ్బంది (ఫైల్)

మండలంలో చోటుచేసుకున్న ప్రమాదాలు

తొర్రూరు మండలం మడిపల్లి గ్రామ శివారు పిల్లిగుండ్ల తండాలో ఇటీవల చోటుచేసుకున్న అగ్ని ప్రమాదం కారణంగా సుమారు 10 ఎకరాల్లో ఉన్న బోడు టేకు కలప, గృహ నిర్మాణం కోసం ఏర్పాటు చేసుకున్న దుంగలు దగ్ధం కావడంతో పాటు ఇళ్ల సమీపంలోకి మంటలు వ్యాపించాయి. సుమారు మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ప్రమాదం జరిగితే వర్ధన్నపేట నుంచి ఫైరింజన్ వచ్చి మంటలు చల్లార్చే వరకు 3 గంటలు పట్టింది. వెల్లికట్టె గ్రామంలో మన్నెం పద్మయ్య ఇల్లుకు షార్ట్‌సర్క్యూట్ కారణంగా నిప్పంటుకోగా ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. స్థానికులే ఇళ్లలోని నీళ్లతో చల్లార్చారు. పల్లె పాపయ్య అనే రైతుకు చెందిన 200 మోపుల గడ్డివాము అంటుకోవడంతో జీపీ ట్యాంకర్ సహాయంతో చల్లార్చే ప్రయత్నం చేశారు. అదేవిధంగా కొమ్మనపల్లి గ్రామంలో బానోత్ వెంకన్నకు చెందిన 250 మోపుల పశువుల దాణా, కంఠాయపాలెం గ్రామశివారు మీఠ్యా తండాకు చెందిన గుగులోతు శ్రీను ఇల్లు షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. స్థానికంగా ఫైర్‌స్టేషన్ లేకపోవడంతో తొర్రూరు, పెద్దవంగర మండలాల్లో ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా నియంత్రించలేక తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


తొర్రూరు మండలం మడిపల్లి గ్రామ శివారులో జరిగిన అగ్నిప్రమాదం (ఫైల్)

పదేళ్లుగా పట్టించుకోవడం లేదు..

కొత్త వెంకట్‌రెడ్డి, రైతు సంఘం తొర్రూరు మండల కార్యదర్శి



తొర్రూరులో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పదేళ్లుగా డిమాండ్ చేస్తున్నాం. ప్రమాదాలు జరిగినప్పుడు మహబూబాబాద్, మరిపెడ, వర్ధన్నపేట ప్రాంతాల నుంచి ఫైరింజన్ రావాల్సి ఉంటుంది. దూర ప్రాంతాల నుంచి ఫైరింజన్ వచ్చే సరికే జరగాల్సిన నష్టం పూర్తిగా జరుగుతుంది. గొప్పల కోసం ప్రజాప్రతినిధులు హామీలిస్తున్నారు తప్పా చర్యలు తీసుకోవడం లేదు. తొర్రూరులో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే తొర్రూరు, పెద్దవంగర మండలాల్లో ప్రమాదాలు జరిగితే వెంటనే నివారించే అవకాశం ఉంది.

మున్సిఫ్ కోర్టు ఏర్పాటు కోసం భవనాల పరిశీలన


భవనాన్ని పరిశీలిస్తున్న జడ్జిలు, డీఎస్పీ

కాటారం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం డివిజన్ కేంద్రంలో మంజూరైన జూనియర్ సివిల్ జడ్జి కం ఫస్ట్ క్లాస్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు కోసం ఆదివారం పలు ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలను జిల్లా జడ్జి నారాయణబాబు, జూనియర్ సివిల్ జడ్జి రాంచందర్‌రావు, అదనపు కోర్టు జూనియర్ సివిల్‌జడ్జి అఖిల పరిశీలించారు. భూపాలపల్లి, మంథని బార్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి వైటీసీ (యూత్ ట్రైనింగ్ సెంటర్), తహసీల్దార్ కార్యాలయం, పలు ప్రైవేట్ భవనాలను పరిశీలించారు. వారి వెంట కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్‌కుమార్, హరిబాబు, ప్రధాన కార్యదర్శులు సహేందర్‌రెడ్డి, మహేందర్, ఏపీవో అనిత, ఎస్సై అభినవ్, పలువురు న్యాయవాదులు తదితరులు ఉన్నారు.

ఎస్ఆర్ఎస్పీ కాల్వలో కోళ్ల కళేబరాలు

- దుర్వాసనతో తండావాసుల ఇబ్బందులు


మాసుకుంటతండా సమీపంలో ఎస్ఆర్ఎస్పీ కాల్వలో కొట్టుకువస్తున్న కోళ్ల కళేబరాలు

ఇనుగుర్తి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఇనుగుర్తి మండలం రాముతండా గ్రామపంచాయతీ పరిధిలోని మాసుకుంటతండా సమీపంలో ఎస్ఆర్ఎస్పీ కాల్వలో ఆదివారం కోళ్ల కళేబరాలు కొట్టుకువచ్చాయి. మూడు రోజులుగా వందల సంఖ్యలో కాల్వలో చనిపోయిన కోళ్లు కొట్టుకువస్తూ నీటి ప్రవాహంలో దిగువ ప్రాంతానికి వెళుతున్నాయి. కాల్వకు ఇరువైపులా ముళ్లపొదలు ఉండడంతో వాటికి కొన్ని కోళ్ల కళేబరాలు చిక్కుకుపోయి అక్కడే ఉన్నాయి. పదుల సంఖ్యలో చనిపోయిన కోళ్లు కాల్వ వెంట ముళ్లలో చిక్కుకొని నిలిచి ఉండడంతో ఆ మార్గంలో తండాకు వెళుతున్న గిరిజనులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో మాసుకుంటతండా నుంచి రాముతండా వైపునకు ఈ నీళ్లు ప్రవహిస్తుండడంతో ఆయా తండాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనర్హులకు బీసీ సర్టిఫికెట్లు!

- ఓపెన్ కేటగిరి వారికి జారీ
- మళ్లీ వారికే ఓబీసీ సర్టిఫికెట్లు మంజూరు
- ఒక్కో దానికి రూ.50వేల వరకు వసూలు



మహదేవపూర్ రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అనర్హులకు బీసీ సర్టిఫికెట్లు జారీ చేయడం భూపాలపల్లి జిల్లాలో కలకలం రేపుతోంది. మహదేవపూర్, కాటారం, మహాముత్తారం, మల్హర్ మండలాల్లో ఓపెన్ క్యాటగిరీకి చెందిన ఓ వర్గానికి ఈ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఒక్కో దానికి రూ.5వేల నుంచి రూ.10వేలు వసూలు చేసినట్టు సమాచారం. మళ్లీ ఆ వ్యక్తులకే ఆ బీసీ సర్టిఫికెట్ ఆధారంగా ఓబీసీ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు తెలిసింది. ఇందుకు ఒక్కో ఓబీసీ సర్టిఫికెట్‌కు అనదనంగా మరో రూ.10వేల నుంచి రూ.15వేల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఈతతంగమంతా ఆయా మండల కేంద్రాల్లోని మీ-సేవ నిర్వాహకులతో పాటు జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్, భూపాలపల్లి తహసీల్దార్ సమీపంలోని మీ-సేవ కేంద్రాల ద్వారా నడుస్తున్నట్లు తెలుస్తోంది. సర్టిఫికెట్లు సైతం జిల్లా కేంద్రం నుంచి జారీ అయినట్లు సమాచారం. జేఈఈ మెయిన్స్ దరఖాస్తు సమయంలో ఈ అక్రమ సర్టిఫికెట్ల జారీ అయినట్లు తెలుస్తుండగా ఆలస్యంగా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మళ్లీ ఇదే తరహాలో వందల సంఖ్యలో సర్టిఫికెట్లు జారీ అయ్యాయని సమాచారం. అనర్హులకు బీసీ సర్టిఫికెట్లు ఇవ్వడమే కాకుండా ఓపెన్ క్యాటగిరీలోనూ అనర్హులకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు తెలిసింది. అక్రమ మార్గంలో పొందిన ఈ ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లతో ఇటీవల ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికైన పలువురు ఉపాధ్యాయులు, హెల్త్‌సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది. అనర్హులకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ జారీ కోసం రూ.50వేల వరకు వసూలు చేసినట్లు వినికిడి. ఈ అక్రమ సర్టిఫికెట్ల వ్యవహారంలో ఓ సింగరేణి ఉద్యోగి ప్రమేయం ఉన్నట్లు చర్చించుకుంటున్నారు.

అనర్హులకు బీసీ, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు జారీ చేస్తుండటంతో అసలైన అర్హులు ఉద్యోగాలను కోల్పోవాల్సి వస్తోందనే ఆవేదన సర్వత్రా వినిపిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా నడుచుకునే ఉద్యోగులతో పాటు మీ-సేవ కేంద్రాలపైన సరైన పర్యవేక్షణ లేకనే ఇలాంటి తప్పిదాలు పునరావృతమవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

మామిడి తోటల్లో ఫ్రూట్ బ్యాగింగ్

- సత్ఫలితాలిస్తున్న విధానం
- కాయ నాణ్యత పెరిగి అధిక లాభాలు
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బ్యాగులకు 50 శాతం రాయితీ

భీమదేవరపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటల్లో ఫ్రూట్ బ్యాగింగ్ పద్ధతితో సత్ఫలితాలు సాధిస్తున్నారు. మామూలు పద్ధతిలో పండిన మామిడి కాయకు టన్నుకు రూ.25 వేల ధర పలుకుతుండగా ఫ్రూట్ బ్యాగింగ్ చేసిన మామిడి కాయలకు రూ.50-70వేల వరకు మార్కెట్లో ధర పలుకుతుంది. ఫ్రూట్ బ్యాగింగ్ చేయడం వల్ల కాయ ఎండ, వాన, క్రిమీ కీటకాల తాకిడిని తట్టుకోవడమే కాకుండా తేమను సైతం తట్టుకుంటుంది. దీంతో ఫ్రూట్ బ్యాగింగ్ చేసిన కాయ నాణ్యతతో ఉండడంతో మార్కెట్లో ఇట్టే అమ్ముడుబోతుంది. ఫ్రూట్ బ్యాగింగ్ గోధుమ రంగు కవరు 50-55 జీఎస్ఎం లోనా బ్లాక్ పేపర్‌తో 30-35 జీఎస్ఎం ఉండాలి. బ్యాగు సైజు 18-30 సెంటీమీటర్ల వరకు వాటర్ ప్రూఫ్‌తో ఉం టుంది. ఇలా కాయను ఫ్రూట్ బ్యాగింగ్ చేయడం వల్ల శ్వాసక్రియకు అనుకూలంగా ఉండాలి. మార్కెట్లో డిమాండ్ ఉన్న హిమాయత్, కేసర్, మల్లిక, బంగినపల్లి మామిడి కాయ లకు ఫ్రూట్ బ్యాగింగ్ చేస్తే రైతులు అధిక లాభాలు పొందవచ్చు.

పిందె ఏర్పడిన 45 రోజుల్లోగా బ్యాగింగ్ చేయాలి

మామిడి పిందె ఏర్పడిన 45 రోజుల తర్వాత నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు ఫ్రూట్ బ్యాగింగ్ చేయాలి. ఫ్రూట్ బ్యాగింగ్ చేసేటప్పుడు పండ్ల ఆరోగ్యాన్ని నిర్ధారించేందుకు పర్యవేక్షణ, నిర్వహణ క్రమం తప్పకుండా చేయాలి.

బ్యాగు కట్టే విధానం

బ్యాగును మామిడి కాయకు కట్టిన తర్వాత నెల తేదీ వేసుకోవాలి. మార్కెట్లో ప్రైవేట్ కంపెనీల వారు ఫ్రూట్ బ్యాగింగ్‌ను రూ.1.25 చొప్పున అమ్ము తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలోని మామిడితోటలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఆ రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీపై ఫ్రూట్ బ్యాగులను అందజేస్తున్నారు. ఫ్రూట్ బ్యాగింగ్ చేసిన 45-60 రోజుల తర్వాత సహజ చక్కెర, ఫినోలిక్ కంపౌండ్స్ ఏర్పడతాయి. ఒక చెట్టుకు ఎన్ని ఫ్రూట్ బ్యాగింగ్‌లైనా చేసుకోవచ్చు.

బ్యాగింగ్‌తో లాభాలు


మామిడి తోటల్లో మామిడి కాయలకు బ్యాగింగ్ చేయడం వల్ల కాయ మొత్తం మూసివేయబడుతుంది. దీంతో ఈదురుగాలుల నుంచి తట్టుకుంటుంది. వాటర్ ప్రూఫ్ కావడంతో వర్షం, ఎండ, క్రిమికీటకాలు, పక్షుల భారీ నుంచి తప్పిస్తుంది. అలాగే కాయ సైజు, పరిమాణం నాణ్యతగా ఉంటుంది. పండు వేగంగా పెరిగేందుకు సహాయ పడుతుంది. మామూలుగా బ్యాగులను జాగ్రత్తగా వాడుకుంటే మరోసారి వాడుకోవచ్చు.



ఫ్రూట్ బ్యాగింగ్ చేసిన మామిడి చెట్టు



మామిడి కాయకు కట్టిన ఫ్రూట్ బ్యాగ్



ఫ్రూట్ బ్యాగింగ్ చేసిన మామిడి పండ్లు

బ్యాగింగ్ చేయడం వల్ల అధిక లాభాలు



మామిడి తోటల్లో బ్యాగింగ్ చేయడం వల్ల అధిక లాభాలు సాధించవచ్చు. ఒక మామిడి కాయకు బ్యాగింగ్ చేస్తే ఎండ, వాన, క్రిమీ కీటకాల నుంచి సంరక్షించుకోవచ్చు. మామూలుగా బంగినపల్లి లాంటి మేలైన జాతి పండ్లకు టన్నుకు రూ.25వేల వరకు ధర పలుకుతుంది. బ్యాగింగ్ చేసిన మామిడి కాయకు టన్నుకు రూ.50-70వేల వరకు మార్కెట్లో ధర పలుకుతుంది. మామిడి రైతులు మామిడి కాయకు బ్యాగింగ్ చేసుకుంటే మంచిది.

సుష్మిత, హార్టికల్చర్ ఆఫీసర్, హనుమకొండ

ఫ్రూట్ బ్యాగులకు రాయితీ ఇవ్వాలి



మామిడి ఫ్రూట్ బ్యాగులను రాయితీపై రైతులకు అందించాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాలో మామిడి రైతులకు ఫ్రూట్ బ్యాగులను అక్కడి రైతులకు 50 శాతం రాయితీతో అందిస్తుంది. తెలంగాణ ప్రాంతంలో కూడా ఫ్రూట్ బ్యాగులను 50శాతం రాయితీపై రైతులకు అందించాలి.

మండల సురేందర్, బీఆర్ఎస్, మండలాధ్యక్షుడు

ఈ-సాక్ష్యతో నేరస్థులకు పక్కా శిక్ష

- కొత్త చట్టాల రూపకల్పన తర్వాత అమలులోకి వచ్చిన ఈ-సాక్ష్య యాప్
- సంఘటన జరిగిన 48 గంటల్లోనే ఆన్‌లైన్‌లో కోర్టుకు సాక్ష్యాలు
- సాక్ష్యాలను భద్రపరిచేందుకు ప్రతీ పోలీస్‌స్టేషన్‌కు రెండు సెల్‌ఫోన్లు



వరంగల్ క్రైం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : నేరాలు జరిగినప్పుడు దానికి సంబంధించిన ఆధారాలకు సేకరించి కోర్టులో సమర్పించడం, నేరానికి పాల్పడినట్లు రుజువు చేయడం పోలీసుశాఖకు చాలా సవాల్‌గా మారేది. దానిలో ఉన్న కొన్ని లొసుగులను సాకుగా చేసుకొని నేరస్థులతో పాటు సాక్ష్యులు తమను బలవంతం పెట్టడం వల్ల ఒప్పుకున్నామని తప్పించుకునేది. అలాంటి వాటికి చెక్ పెడుతూ గతంలో బ్రిటిష్ వాళ్లు తీసుకొచ్చిన పాత చట్టాలను కేంద్ర ప్రభుత్వం మార్చి కొత్త చట్టాలను రూపొందించడంతో ఈ-సాక్ష యాప్ తెరపైకి వచ్చింది. 2024 జూలై తర్వాత నుంచి ప్రతీ కేసులో సాక్షాధారాలకు సాక్ష యాప్‌నే వినియోగిస్తూ నేరం చేసిన వ్యక్తి శిక్ష నుంచి తప్పించుకోకుండా శిక్షల శాతంను పోలీసుశాఖ పెంచుతుంది.

ప్రతీ పోలీస్‌స్టేషన్‌కు రెండు సెల్‌ఫోన్‌లు

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ-సాక్ష్య యాప్‌లో ఆయా పోలీస్ స్టేషన్లలో జరిగే ప్రతీ నేరానికి సంబంధించిన సీన్ ఆఫ్ ఆఫెన్స్, సాక్ష్యాల వాంగ్మూలం, నేరస్థుడు తాను చేసిన నేరాన్ని ఒప్పుకోవడం వంటి అంశాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈ యాప్‌లో రికార్డ్ చేసిన వివరాలన్నింటినీ పోలీసులు 48 గంటల్లో కోర్టుల్లోని ఐసీజేఎస్ వెబ్‌సైట్‌కు ఆన్‌లైన్‌లో పంపిస్తారు. కేసు బెంచీపైకి వచ్చిన రోజు ఐసీజేఎస్‌లో భద్రపరిచిన కేసుకు సంబంధించిన వివరాలను న్యాయమూర్తికి అందజేస్తారు. రికార్డు రూపంలో సాక్ష్యాలు ఉండటంతో నేరస్థులు, తాయిలాలకు తలొగ్గి లేదా నేరస్థులకు సాక్ష్యులు భయపడి తప్పించుకునే వీలు లేకుండా పకడ్బందీగా రూపకల్పన చేశారు. గతంలో ఎలక్ట్రానిక్ డివైస్ సాక్ష్యాలకు అవకాశం ఉన్నప్పటికీ సీడీ, పెన్ డ్రైవ్ రూపంలో కోర్టులో సమర్పించి ఇండియన్ ఎవిడెన్స్ యాక్టు ప్రాకారం 65-బీ అనే సర్టిఫికెట్ కోర్టుకు ఇవ్వాల్సి ఉండే దానికి చాలా సమయం అయ్యేది. కానీ సాక్ష యాప్‌తో ఆ తిప్పలన్నీ తప్పాయని పోలీసుశాఖ అంటుంది.

నేరస్థులకు శిక్ష పడటమే యాప్ ఉద్దేశం

ఇప్పటికే సాంకేతికతను వినియోగించిన సత్ఫలితాలను సాధిస్తున్న పోలీసుశాఖ ఈ సాక్ష యాప్‌తో నేరస్థులకు శిక్ష పడటంలో సక్సెస్ సాధిస్తోంది. ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ తన మొబైల్ నెంబర్‌తో ఒక సారి లాగిన్ అయి నేరానికి సంబంధించి వివరాలను అప్‌లోడ్ చేస్తే ఎప్పటికైనా ఆ సాక్షాలు అందులో పదిలంగా ఉంటాయి. మళ్లీ సాక్ష్యాల వివరాలు కావాలనుకుంటే యాప్‌లో కేసు నెంబర్, తేదీ, సంవత్సరం నమోదు చేస్తే ఆ రోజు జరిగిన నేరానికి సంబంధించిన వివరాలన్నీ కనిపిస్తాయి. స్టేషన్ అధికారులతో పాటు కోర్టు డ్యూటీ నిర్వహించేవారితో పాటు స్టేషన్ రైటర్స్‌కు ఈ యాప్‌పై అవగాహన కల్పించారు. కేసు ఇన్వెస్టిగేషన్‌పై కోర్టులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ సాక్ష యాప్‌తో సులవుగా అవుతుందని పోలీసువర్గాలు తెలుపుతున్నాయి. కేంద్రం యాప్ తీసుకొచ్చిన తర్వాత మొట్టమొదటిగా తెలంగాణ పోలీసులే యాప్ ద్వారా సాక్ష్యాలను కోర్టుకు సమర్పించినట్లుగా కమిషనరేట్ పోలీసులు పేర్కొంటున్నారు.

రారండోయ్.. ఇస్రోను చూసొద్దాం..

- 9వ తరగతి విద్యార్థులకు ఆహ్వానం
- యువ విజ్ఞాన కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రోత్సాహం
- ఏప్రిల్‌లో ఎంపిక, మేలో 14 రోజుల పాటు శిక్షణ
- అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన
- ఎంపికైన విద్యార్థులకు ఉచిత సౌకర్యాలు
- దేశ వ్యాప్తంగా 7 కేంద్రాల్లో నిర్వహణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్/జఫర్‌గఢ్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) యేటా యువ విజ్ఞాన కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ ఏడాది చేపట్టబోయే కార్యక్రమం కోసం దేశ వ్యాప్తంగా తొమ్మిదో తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. అంతరిక్ష పరిశోధనల్లో ఇస్రో వంద ప్రయోగాలు పూర్తి చేసుకుని ప్రపంచంలో అగ్రదేశాల సరసన భారత్ నిలిచిందనడంలో ఎలాంటి సందేహంలేదు. భారత్ పలు పరిశోధనలు చేపడుతూ శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు తెలియజేసేందుకు, వారిలో స్ఫూర్తిని నింపేందుకు ఇస్రో ఈ బృహోత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఏటా అనేక మంది విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దుతోంది.

ఈ నెల 23 వరకు గడువు

సైన్స్ పట్ల ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 23 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఇస్రో అవకాశం కల్పించింది. విద్యార్థులు www.isro.gov.in లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకునే విద్యార్థి 2025, జనవరి 1 నాటికి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతూ ఉండాలి. విద్యార్థులు మొదట వారి ఈ-మెయిల్ ఐడీతో రిజిస్ట్రేషన్ చేసుకున్న రెండు రోజుల తరువాత ఇస్రో ఏర్పాటు చేసే ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి. ఈ ప్రక్రియ పూర్తయిన గంట తరువాత యువికా పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తుతో పూర్తి వివరాలు నమోదు చేసి ధ్రువ పత్రాలు అప్‌లోడ్ చేయాలి. ఏప్రిల్ నెలలో ఎంపిక జాబితాలను ప్రకటించనున్నారు. విద్యార్థుల దరఖాస్తులను పరిశీలించిన అనంతరం ఏప్రిల్ 7న దేశవ్యాప్తంగా ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేస్తారు. మే 19 నుంచి 30 వరకు యువికా-25 కార్యక్రమం నిర్వహిస్తారు. మే 31న ముగింపు కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు (బాలసైంటిస్టులు) బహుమతులు అందజేస్తారు.

దరఖాస్తుదారులకు వెయిటేజీ కేటాయింపు

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు దారులు 8వ తరగతిలో సాధించిన మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇస్తారు. 9వ తరగతి విద్యార్థులు సహ పాఠ్యాంశాలపై పట్టు కలిగి ఉండాలి. స్కౌట్స్ అండ్ గేమ్స్, ఎన్ఎస్ఎస్‌లో పాల్గొంటే 5 శాతం, గ్రామీణ ప్రాంత పాఠశాల విద్యార్థులకు మరో 15 శాతం అదనపు అర్హత కల్పిస్తారు. ఆన్‌లైన్ క్విజ్ ప్రతిభకు 10 శాతం, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల్లో పాల్గొన్న వారికి 10 శాతం, ఒలింపియాడ్ సైన్స్ పోటీల్లో బహుమతులు పొందిన ప్రతిభావంతులకు 5 శాతం, క్రీడా పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి 5 శాతం చొప్పున వెయిటేజీ కల్పిస్తారు.

శాస్త్ర, సాంకేతికంపై శిక్షణ

యువ విజ్ఞాన కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులకు శాస్త్ర, సాంకేతికం వంటి అంశాలపై శిక్షణ ఇస్తారు. మే నెలలో 14 రోజుల పాటు ఇస్రోకు సంబంధించిన దేశంలోని యూఆర్‌రావు శాటిలైట్ సెంటర్- బెంగుళూరు, స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ -అహ్మదాబాద్, విక్రమ్ సారాబాయ్ స్పేస్ రీసెర్చ్ సెంటర్- తిరువనంతపురం, నార్త్ ఈస్ట్ అప్లికేషన్ సెంటర్ - షిల్లాంగ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ - డెహ్రాడూన్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ - హైద్రాబాద్, నీతీష్‌ధావన్ స్పేస్ సెంటర్ - శ్రీహరికోట ఏడు కేంద్రాల్లో శిబిరాలను నిర్వహించి శిక్షణ ఇవ్వనున్నారు. రెసిడెన్షియల్ పద్ధతిలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రయోగాత్మక ప్రదర్శన, ల్యాబ్ సందర్శన, నిపుణులతో ప్రాక్టికల్స్, ఫీడ్‌బ్యాక్ సెషన్‌లు, ప్రముఖ శాస్త్రవేత్తల అనుభవాలు, చర్చ కార్యక్రమాలు వంటివి నిర్వహించడంతో పాటు అంతరిక్ష విజ్ఞానం, రాకెట్ ప్రయోగాలు తదితర అంశాలపై విద్యార్థులకు వివరిస్తూ అవగాహన కల్పిస్తారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ముగింపు కార్యక్రమంలో బహుమతులను అందిస్తారు. కాగా, ఎంపికైన విద్యార్థితో పాటు తల్లిదండ్రుల్లో ఒకరికి లేదా గైడ్ ఉపాధ్యాయుడికి ప్రయాణ ఖర్చులు చెల్లింపుతో పాటు ఉచిత భోజన, వసతి సౌకర్యాలను ఇస్రో కల్పిస్తుంది.



ఎంపికైన విద్యార్థులకు ఉచిత సౌకర్యాలు

ఇస్రో నిర్వహించే యువికా కార్యక్రమానికి ఎంపికైన పాఠశాల విద్యార్థులకు ప్రయాణ, భోజన వసతి, సౌకర్యాలను ఇస్రో ఉచితంగానే కల్పిస్తోంది. ఎంపికైన విద్యార్థులను మే నెలలో 14 రోజుల పాటు ఇస్రోకు చెందిన స్పేస్ సెంటర్లకు తీసుకువెళ్తారు. అక్కడ సైన్స్‌కు సంబంధించిన వింతలు, విశేషాలు, నవగ్రహ కూటమి మొదలగు అంశాలపై వారికి శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారు. శాస్త్రవేత్తలతో మాట్లాడే అవకాశం విద్యార్థులకు కల్పిస్తారు.

ఎవరు అర్హులంటే..

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. 8వ తరగతిలో సాధించిన మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. స్పేస్, సైన్స్ క్లబ్‌లలో ఉంటే 5 శాతం, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో ప్రతిభ చూపితే 10 శాతం, ఎన్‌సీసీ, స్కౌట్స్‌అండ్ గైడ్స్ విభాగాల్లో ఉంటే 5 శాతం, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి 20 శాతం ప్రాధాన్యం ఇస్తారు.

ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహించాలి

డాక్టర్ ఏ. రవీందర్‌రెడ్డి, డీఈవో, మహబూబాబాద్



అంతరిక్ష పరిశోధనలో అగ్రగామిగా నిలుస్తున్న ఇస్రో విద్యార్థులకు కల్పిస్తున్న యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా)లో జిల్లా నుంచి ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించాలి. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఇస్రో కల్పిస్తున్న అద్భుత అవకాశాన్ని అత్యధికంగా విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా వారికి ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలి.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

ఎం.రమేశ్, డీఈవో, జనగామ



ఆసక్తి గల 9వ తరగతి విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పాఠశాల స్థాయి విద్యార్థుల్లో శాస్త్రీయ సాంకేతిక అవగాహన, అంతరిక్ష పరిశోధన రంగాలపై ఈ శిక్షణ అవగాహన పెంచుతుంది. తద్వారా విద్యార్థులు యువ శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహదపడుతుంది. విద్యార్థులు తమ ప్రతిభను చూపేందుకు ఈ కార్యక్రమం చక్కటి వేదిక. జిల్లాలోని తొమ్మిదో తరగతి విద్యార్థులు ఈ నెల 23వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి, లేదా ఇస్రో యువికా వెబ్‌సైట్‌లో సంప్రదించాలి.

యువికాతో విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి

బి. అప్పారావు, డీఎస్వో, మహబూబాబాద్



యువ విజ్ఞాన కార్యక్రమంతో విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి పెరుగుతుంది. అనేక రంగాల్లో సేవలందిస్తూ కృత్రిమ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపిస్తూ, ప్రపంచంలో అగ్రస్థానాన్ని పొందిన ఇస్రో సంస్థ పాఠశాల విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలు, పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు దోహదపడుతోంది. ఇందులో ఎక్కువ మంది విద్యార్థులను భాగస్వాములను చేసేందుకు సైన్స్ ఉపాధ్యాయులు కృషి చేయాలి.

హర.. ముక్తీశ్వర..

- కల్పతరువు కాళేశ్వరం.. దినదినాభివృద్ధి
- ఆలయ అభివృద్ధితో ఎంతో మందికి జీవనోపాధి
- దండకారణ్యం నుంచి పట్టణ స్థాయి ప్రగతి

మహదేవపూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు దండకారణ్యం.. కాకులు దూరని కారడవిలా ఉండేవి కాళేశ్వరం పరిసరాలు. ఇళ్లు అక్కడక్కడ కొన్ని మాత్రమే ఉండేవి. త్రివేణి సంగమ ఒడ్డున స్వల్పంగానే జన జీవనం సాగేది. ఆర్టీసీ బస్సులు కూడా రాని పరిస్థితి. రవాణా లేక, ఇతరత్రా సౌకర్యాలు లేక అష్టకష్టాలు ఎదుర్కొనే వారు అక్కడి వాసులు. దీంతో చాలా మంది వలస వెళ్లిపోయారు. ఇక్కడి భూములు వదులుకొని కాటారం, భూపాలపల్లి, వరంగల్, హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. కాళేశ్వర ముక్తీశ్వర ఆలయానికి భక్తులు ఎడ్ల బండ్లలో వచ్చే వారు. 1976లో అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి, దేవాదాయ శాఖ ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న చొక్కారావు చొరవతో ఆదిశంకరాచార్యుల సూచన మేరకు కాళేశ్వరాలయాన్ని అభివృద్ధి చేశారు. ఆయా పనులు చేపట్టి ఆలయానికి 1982లో జీర్ణోద్ధారణ చేశారు. ఆ తర్వాత ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. కాళేశ్వరంతో పాటు మహదేవపూర్ కూడా ప్రగతి వైపు పరుగులు పెడుతోంది. ఈ ఆలయం ద్వారా ఎంతో మంది జీవనోపాధి పొందుతున్నారు.

మెరుగైన రవాణా సౌకర్యం

మూడు రాష్ట్రాల వారధిగా కాళేశ్వరం రవాణా వ్యవస్థ మెరుగుపడింది. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్రలను కలుపుతూ బ్రిడ్జీలు, రోడ్లు ఏర్పడటంతో ఇతర రాష్ట్రాల ప్రజలు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు. త్రివేణి సంగమం వద్ద కాళేశ్వరుడికి నిత్యం వేలాది మంది పూజలు చేస్తుంటారు. ఈ క్రమంలో పుణ్య స్నానం ఆచరించి భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహిస్తుంటారు. ప్రయాగ్‌రాజ్ తర్వాత త్రివేణి సంగమంలో కొలువైన క్షేత్రంగా కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయం ఖ్యాతి పొందింది. దీని దగ్గర ఉన్న నదిని అమ్మవారిగా పూజలు నిర్వహిస్తుంటారు. సాయంకాల ప్రదోషకాల వేళ నదీ హారతి ఇస్తారు. గోదావరి నది స్నాన మాచరిస్తే శరీర శుద్ధితో పాటు పాపాలు పోతాయని పురాణాలు చెబుతున్నాయి.



కాళేశ్వరాలయం వద్ద వెలిసిన భవనాలు

ప్రభుత్వానికి ఆదాయం

ఆలయానికి వచ్చే భక్తులతో రాష్ట్ర ప్రభుత్వానికి సైతం పెద్ద ఎత్తున ఆదాయం సమకూరుతోంది. కాళేశ్వరానికి రోజువారీగా ఆర్టీసీ బస్సులకు చాలామంది భక్తులు తరలివెళ్తుంటారు. దీంతో కాళేశ్వరానికి భూపాలపల్లి, హనుమకొండ, పరకాల, మంథని, కరీంనగర్ ఇతర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో వస్తుండటంతో ఆర్టీసీకి పెద్ద ఎత్తున ఆదాయం సమకూరుతోంది. ఆలయ హుండీలు, టెండర్లు, భక్తులు చేసే ప్రత్యేక పూజల ద్వారా వచ్చే డబ్బులు, టోకెన్లు, లడ్డూలు వసతి గృహాలతో పాటు ఇతర అవసరాలకు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది. అలాగే ఇక్కడ హరిత హోటల్ ద్వారా మెరుగైన ఆదాయ వస్తోంది.

అర్చకులకు ఉపాధి

చనిపోయిన వారి అస్తికలు కలిపేందుకు కాళేశ్వరానికి జనం పెద్ద ఎత్తున తరలివస్తారు. త్రివేణి సంగమ గోదావరిలో కలిపితే వారి ఆత్మకు శాంతితో పాటు ముక్తి లభిస్తుందనే ఉద్దేశంతో పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. పూజా క్రతువులు నిర్వహించడానికి అర్చకులు అక్కడ ఉంటారు. వందలమంది అర్చక కుటుంబాలు సైతం ఉపాధి పొందుతున్నాయి.

బోటింగ్, ఆటోల ద్వారా..

త్రివేణి సంగమ గోదావరిలో బోటింగ్ సిస్టం ఉంది. వేల కొద్ది మంది భక్తులు త్రివేణి సంగమంలో బోటింగ్‌తో పాటు ప్రాణహిత అవతల వైపు వెళ్తుంటారు. బోటింగ్ సిస్టం ద్వారా వందల కొద్ది ఉపాధి పొందుతున్నారు. అలాగే కాళేశ్వరం ఆర్టీసీ బస్టాండ్ నుంచి గోదావరి వరకు నిత్యం ఆటోలు భక్తులను తరలిస్తుంటాయి. దీంతో వందల మంది ఆటో కార్మికులు పెద్ద ఎత్తున జీవనం సాగిస్తున్నారు.

హోటళ్లు, లాడ్జీల ద్వారా..

కాళేశ్వరంలో భక్తులు బస చేయడానికి హరిత హోటల్ ఉంది. దీంతోపాటు ప్రైవేటు హోటళ్లు, లాడ్జీలు ఉన్నాయి. అలాగే భోజన, టిఫిన్‌సెంటర్లు, కిరాణ దుకాణాలు ఇలా ఎంతో మంది ఉపాధి పొందుతున్నారు.

పెరుగుతున్న రియల్ ఎస్టేట్

కాళేశ్వరం పరిసర ప్రాంతాల్లో ఒకప్పుడు సాగు భూములున్నా ఎవరూ ఉండేవారు కాదు. ప్రస్తుతం వ్యవసాయంతో పాటు రియల్ ఎస్టేట్ రంగంలో చాలామంది జీవనోపాధి పొందుతున్నారు. కాళేశ్వరం సమీపాన ఒక ఎకరం భూమి ధర రూ.కోటి పైమాటే. పంటలు సాగు చేసే భూములు రూ.10 లక్షల నుంచి రూ.30లక్షల వరకు అందుబాటులో ఉన్నాయి. ఇక ఇళ్ల స్థలాల మాట రేట్లు ఎక్కువగానే ఉన్నాయి.

మోదుగు పూసినదీ..

మోదుగు పూలు కనువిందు చేస్తున్నాయి. హోలీ వేడుకలకు సిద్ధం అన్నట్టు కళకళలాడుతున్నాయి. మోదుగుపూలు విరబూసి పండుగ వస్తున్న విషయాన్ని గుర్తు చేస్తున్నాయి. ఆకురాలే కాలంలో అడవుల్లోని మోదుగు చెట్లకు పూసిన లేలేత ఎరుపురంగులోని పూలు అడవుల్లో అందంగా కనిపిస్తున్నాయి. గతంలో ప్రజలు మోదుగు పువ్వును హోలీ పండుగకు ఐదు రోజుల ముందు సేకరించి మట్టి పాత్రల్లో ఉడికించి రంగు తయారు చేసేవారు. ఈ రంగు శరీరంపై పోస్తే వారం రోజులు ఉండేది. అలాగే దుస్తులకు అంటిన మోదుగు పువ్వు మరకలు పోవు. మోదుగు పువ్వుతో ఎలాంటి చర్మ వ్యాధులు వచ్చేవి కావు. కానీ, నేటి ఆధునిక ప్రపంచంలో మార్కెట్లో లభించే రకరకాల రసాయన రంగులకు ప్రజలు ఆకర్షితులై చర్మవ్యాధులను కొని తెచ్చుకుంటున్నారు. దీంతో మోదుగు పూలు చెట్లకే పరిమితమవుతున్నాయి. భూపాలపల్లి జిల్లా కేంద్రం, నెక్కొండలో ఇవి విపరీతంగా విరబూయగా వాటిని పక్షులు ముద్దాడాయి. ఈ సుందర దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి/నెక్కొండ

నెక్కొండలో విరబూసిన మోదుగు పూలు





భూపాలపల్లిలో మోదుగు పువ్వులపై వాలిన పక్షులు



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ములుగు
సోమవారం 10 మార్చి 2025

హేమాచల క్షేత్రంలో భక్తుల సందడి



హేమాచల క్షేత్రంలో భక్తులకు హారతిస్తున్న అర్చకుడు (ఇన్‌సెట్‌లో) స్వామి వారి మూల విరాట్

మంగపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మల్లూరు హేమాచలకొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం సందడి నెలకొంది. వారాంత సెలవు కావడంతో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 12 వేల మంది భక్తులు దైవ దర్శనాలు చేసుకున్నారు. ఉదయాన్నే కొండపైకి భక్తులు చింతామణి జలధారల వద్ద పుణ్య స్నానాలు ఆచరించారు. జలాంజనేయస్వామి, పంచముఖాంజనేయస్వామి, రమ సత్యనారాయణస్వామి, వేణుగోపాలస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపై కొలువై ఉన్న లక్ష్మీనరసింహస్వామిని, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి దేవతలను అమ్మవార్లను దర్శించుకున్నారు. తల్లులకు చీరె, సారె, పుసుపు, కుంకుమ, పూలు, పత్రీ సమర్పించి కొబ్బరికాయ కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారిని భక్తులు దర్శించుకునే క్రమంలో మూలవిరాట్‌కు ప్రధానార్చకుడు ముక్కమల్ల రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు పవన్‌కుమారాచార్యులు, ఈశ్వర్‌చంద్‌శర్మ, అనిపెద్ది మురళీకృష్ణశర్మ, వెంకటనారాయణశర్మ, రిటైర్డు అర్చకులు కైంకైర్యం రాఘవాచార్యులు తిలా, తైలాభిషేకాలు చేశారు. నూతన వస్త్రాలు, గజమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దైవ దర్శనాలు గావించి తీర్థప్రసాదాలను అందజేశారు.

దేవునిగుట్ట జాతరకు ఏర్పాట్లు చేయాలని మంత్రి సీతక్కకు వినతి



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ములుగు కలెక్టరేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని కొత్తూరు గ్రామ శివారులోని దేవునిగుట్టపై కొలువై ఉన్న లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం, జాతర ఈనెల 12నుంచి 14 వరకు జరుగుతుందని, ఈసందర్భంగా తగిన ఏర్పాట్లు చేయాలని కోరుతూ ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం ములుగులో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయసీతక్కకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన సీఐ

వెంకటాపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జగదాంబ సెంటర్‌లో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆదివారం స్థానిక సీఐ బండారి కుమార్, ఎస్సై కొప్పుల తిరుపతి రావు ప్రారంభించారు. ఈసందర్భంగా సీఐ కుమార్ మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం శుభపరిణామమని అన్నారు. స్వచ్ఛం సేవాసంస్థను మరికొందరు ఆదర్శంగా తీసుకుని ముందుకు రావాలని కోరారు. ఈకార్యక్రమంలో బాలసాని అశ్వపతి, చేయూత స్వచ్ఛందసంస్థ అధ్యక్షుడు చిడెం సాయిప్రకాష్, సభ్యులు శశికుమార్, అన్వర్, సలీం, కిషోర్ పాల్గొన్నారు.

బీసీ బిల్లుకు సహకరించాలి

మల్హర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : నిత్యం బీసీ జపం చేసే అఖిలపక్ష నాయకులు బీసీ రిజర్వేషన్ పెంపునకు సంబంధించిన బిల్లుకు సహకరించాలని జాతీయ బీసీ సంఘం జిల్లా ఇన్‌చార్జి విజయగిరి సమ్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, కేంద్రంలో మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసి బీసీలకు ప్రమోషన్లు, ఉద్యోగాల ఎంపికలో క్రిమీలేయర్ విధానాన్ని ఎత్తి వేయాలని కోరారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలు, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని మంత్రి వర్గ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే గండ్ర



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ

రేగొండ, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. కొత్తపల్లిగోరి, రేగొండ మండలాలలోని రామన్న గూడెంతండా, తిరుమలగిరి, జగ్గయ్యపేట, సుల్తాన్‌పూర్, కనిపర్తి, నాగుర్లపల్లి, రేపాక, పోచంపల్లి, బాగిర్తిపేట, రేగొండ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా 30మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలిచిందన్నారు. ముఖ్యంగా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి ఆ బస్సులకేవారిని ఓనర్లు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేతారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టన్న, పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు, రాష్ట్ర నాయకుడు ఎన్ఎస్ఆర్ సంపత్‌రావు, నాయకులు నర్సన్న, మోడెం ఉమేష్‌గౌడ్, ఎడ్ల మల్లారెడ్డి, కొలెపాక సాంబయ్య, రవికుమార్, పట్టెం శంకర్, గండి తిరుపతి, పున్నం రవి, వీరబ్రహ్మం, ముద్దమల్ల రఘు, థామస్, తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎం కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

గోవిందరావుపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పస్రా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని ప్రాజెక్టునగర్ సబ్ సెంటర్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న ఏఎన్ఎం కె.సురేఖ గతనెలలో గుండెపోటుతో మృతిచెందింది. ఈసందర్భంగా పస్రా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి మధు, సిబ్బంది ఆదివారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి రూ.40వేలు, ఐఎన్‌టీయూసీ-3194 యూనియన్ ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఫయాజ్ మొహినొద్దీన్, ములుగు జిల్లా అధ్యక్షుడు వంగేటి వెంకటేశ్వర్లు, కోశా. ధికారి చింతమల్ల వినోదర్, కార్యదర్శి జె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో రూ.55వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు డీపీఎంవో బెల్లంకొండ సుధాకర్‌రెడ్డి, హెచ్ఈవో కత్తి మొగిలి, ఎస్‌యూవో పి.భూపాల్‌రెడ్డి, హెచ్ఈవో సురేష్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, రిటైర్డు ఏపీఎంవో మురారి, స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది, యూనియన్ నాయకులు సరోజన, సుజాత, వెంకటమ్మ, జంపయ్య, శ్రీనివాస్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



వాజేడు జడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు

వాజేడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వాజేడు జడ్పీహైస్కూల్‌లో పదో తరగతి 1999-2000 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు సిల్వర్ జూబ్లీ వేడుకలను ఆదివారం నిర్వహించారు. సుమారు 60 మంది విద్యార్థులు, అప్పటి 25 మంది ఉపాధ్యాయులు ఒక చోట చేరి అలనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. వివిధ హోదాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి మెమొంటోలను అందజేశారు. ఉపాధ్యాయులు కృష్ణార్జునరావు, నరసింహరావు, వెంకటరావు, బి.నరసింహరావు, సోమయ్యాచారి, పురుషోత్తం, రామ్మూర్తి, వేణు, కిషోర్, రమణచారి, సత్యనారాయణ, పీయర్స్, చక్రధర్, కృష్ణయ్య, విద్యార్థులు కొప్పుల రఘుపతి, లక్ష్మణ్, గోవింద్, శివకృష్ణ, రవి, విజయ్, విశాల్, పవన్, చంద్రకాంత, విశాలి, సుహాసిని, విజయ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల ఉన్నత పాఠశాలలో..



చిట్యాల ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు

చిట్యాల (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998-99 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళనం వేడుకగా జరిగింది. 26 సంవత్సరాల తర్వాత కలుసుకున్న మిత్రులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు ఐత రాజయ్య, రామ్మోహన్, భిక్షపతి, ఐలయ్య, సోమేశ్వర్, మురళీధర్‌ను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాలవేణి రాంబాబు, తూముల విజేందర్, కోడెల నరేందర్, సాద శ్రీనివాస్, తాటిపెల్లి శ్రీనివాస్, దశరథం, రాజు, సతీష్, సుమలత, స్రవంతి, శ్రీవిద్య, ధనలక్ష్మి, మమత, తిరుమల, అశోక్, మహేందర్, యుగంధర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



స్వామి వారి మూల విరాట్

మంగపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాపురం బిల్ట్ కాలనీలో శ్రీ వెంక టేశ్వరస్వామి ఆలయంలో వార్షిక వేద అధ్యయన ఉత్సవాల్లో ఆదివారం ఉదయం సుప్రభా తసేవా కాలం, ప్రభాధికి, పంచసూక్త నారసింహ సుదర్శన మూల మంత్రహోవనం పూర్ణా హుతి, నివేదన, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణను ప్రధానార్చకులు ప్రతాపురం శ్రీనివాసాచార్యులు, వంశీ కుమారాచార్యులు నిర్వహించారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం, నమ్మల్వార్ పరమ పద ఉత్స వం, నివేదన, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, శాంతి హోమం జరిగాయి. ఈ కార్యక్రమంలో బిల్ట్ కార్మికులు కుటుంబ సమేతంగా హాజరయ్యారు.



ఆరోగ్యం

డాక్టర్ చీర్ల ప్రశాంత్, వెంకటాపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి

వేసవి జాగ్రత్తలు తప్పనిసరి

ఆంధ్రజ్యోతి : వేడిని ఎలా తట్టుకోవాలి?

డాక్టర్ : ఇంట్లో వాతావరణం చల్లగా ఉండేలా చూసుకోవాలి. ఎండలో వెళ్లేవారు సన్‌స్క్రీన్ లోషన్ తప్పనిసరిగా వాడాలి. రోజుకు కనీసం నాలుగు లీటర్ల మంచినీరు తీసుకోవాలి.

ఆంధ్రజ్యోతి : వేసవిలో ఏసీల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి ?

డాక్టర్ : ఏసీని 24 గంటలు నడుపొద్దు, రోజుకు కొన్ని గంటలు మాత్రమే వినియోగించాలి. తాజా గాలి లోపలికి వచ్చేలా చూసుకోవాలి. ఏసీ వాతావరణంలో డీహైడ్రేషన్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

ఆంధ్రజ్యోతి : వేసవిలో చర్మ సంరక్షణను ఎలా కాపాడుకోవాలి ?

డాక్టర్ : రోజంతా చర్మంపై తేమ ఉండేలా చూసుకోవాలి. చర్మం బాగా పొడిబారినప్పుడు సబ్బుతో ఎక్కువసార్లు కడుక్కోవద్దు, సూర్యుడి నుంచి వెలువడే అతినీలోహిత కిరణాల వల్ల చర్మంపై ముడతలు ఏర్పడే ప్రమాదం ఉంటుంది.

ఆంధ్రజ్యోతి : వేసవిలో మనం తీసుకునే ఉత్తమ ఆహారం ఏమిటి ?

డాక్టర్ : ఉదయం లేవగానే రెండు గ్లాసులు కుండలోని మంచినీరు తాగాలి. గంటకోసారి మసాల లేని కూరలతో చేసిన మామూలు భోజనం చేయాలి. వారంలో రెండుసార్లు కొబ్బరినీళ్లు తాగడం ఉత్తమం.

ఆంధ్రజ్యోతి : గర్భిణులు ఎలాంటి ఆరోగ్య సూత్రాలు పాటించాలి ?

డాక్టర్ : ఉదయం పూట గర్భిణులు కొద్దిపాటి వ్యాయామం చేయాలి. ప్రసవ సమయం దగ్గరపడుతున్న కొద్దీ పరీక్షలు తరచూ చేయించుకోవాలి. ఒకే ఆస్పత్రి, ఒకే వైద్యనిపుణుల సంరక్షణలో ఉండాలి.

- వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి)

నేటి నుంచి చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూసేకరణపై గ్రామ సభలు

కాటారం, మార్చి 9(ఆంధ్రజ్యోతి):చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా వివిధ పనుల కోసం చేపట్టే భూసేకరణ కోసం సోమ, మంగళ, బుధవారాల్లో గ్రావ ఃసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నాగరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ విభాగం) ఆధ్వర్యంలో జరిగే గ్రామ సభలకు భూములు కోల్పోతున్న రైతులు హాజరై తమ అభిప్రాయాలను తెలపాలన్నారు. 10వ తేదీన ఉదయం 10.30 గంటలకు కాటారం రైతువేదికలో గారెపల్లి పైప్‌లైన్‌కు సంబంధించిన 4ఎకరాల 38.50 గుంటల భూసేకరణ గ్రామసభ, 11న జాదరావుపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో గూడూరు పెద్ద చెరువు కట్ట విస్తరణకు సంబంధించిన 5ఎకరాల 16 గుంటల కోసం గ్రామసభ, 12న చిద్నెపల్లి జీపీలో గారెపల్లి నూతన రిజర్వాయర్ సిస్టర్న్ నిర్మాణం కోసం చిద్నెపల్లి, ప్రతాపగిరి, చింతకాని పరిధిలో 32ఎకరాల 38గుంటల భూసేకరణ కోసం గ్రామసభ నిర్వహిస్తున్నట్లువెల్లడించారు.

దర్జాగా దోపిడీ!

5వ పేజీ తరువాయి

మిల్లర్లు రూ.18 చెల్లిస్తుండగా మహారాష్ట్రలో మాత్రం రూ.30 చెల్లిస్తుండటంతో జిల్లా వ్యాప్తంగా పీడీఎస్ స్మగ్లింగ్ దందా వ్యవస్థీకృతంగా మారిందని పోలీసులు చెబుతున్నారు. ముఖ్యంగా జిల్లాలో కాటారం, చిట్యాల, గణపురం ప్రాంతాల్లో తిష్ట వేసినా ముగ్గురు బడా స్మగ్లర్లు అధికార పార్టీ నేతల పేర్లు చెప్పుకుంటూ ఈ దందాను దర్జాగా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిన్నమొన్నటి వరకు వీరంతా ఉమ్మడిగా స్మగ్లింగ్ దందాను నడిపినా ఇటీవల కాలంలో వీరి మధ్య పొరపచ్చాలు రావడంతో ప్రాంతాల వారీగా బియ్యం సేకరణ నెట్‌వర్క్‌ను పంచుకున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. అయితే.. నిఘా పెట్టాల్సిన రెవెన్యూ, టాస్క్‌ఫోర్స్, అడపాదడపా దాడులు నిర్వహించి చేతులు దులుపుకోవడం పట్ల అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ స్మగ్లింగ్ ముఠాలతో రెవెన్యూ, పోలీసు, పౌర సరఫరాల శాఖలకు చెందిన కొంతమంది అధికారులకు సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. స్మగ్లర్లు ప్రతి నెలా వీరికి లక్షల్లో మామూళ్లు ముట్టజెబుతూ బియ్యాన్ని దర్జాగా సరిహద్దులు దాటిస్తున్నారని సమా చారం. ఈ వ్యవహారాన్ని అనేకమార్లు వెలుగులోకి తెచ్చేందుకు ప్రయత్నించిన ప్రజా వేగులను కూడా స్మగ్లర్లు మచ్చిక చేసుకున్నారని తెలుస్తోంది.

రేషన్ బియ్యం మళ్లీ రైస్‌మిల్లులకే..

ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు పంపిణీ చేసేందుకు ఉద్దేశించిన రేషన్ బియ్యం దొడ్డిదారిన తిరిగి రైస్‌మిల్లులకే చేరుతోంది. తద్వారా అదే బియ్యం నిల్వలు సంచులు మారి తిరిగి మళ్లీ ప్రజాపంపిణీ వ్యవస్థకే చేరుతుండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. భూపాలపల్లి జిల్లాలో 32 రైస్‌మిల్లులు ఉండగా పౌరసరఫరాల శాఖ సేకరించిన వరి ధాన్యాన్ని మిల్లులకు కేటాయించి కస్టమ్ మిల్లింగ్ చేయిస్తోంది. ఇలా 2023-24 రబీ సీజన్‌లో జిల్లాకు సంబంధించి మొత్తం 39,154 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లకు కేటాయించగా ఇందులో ఇంకా 2,672 క్వింటాళ్ల సీఎంఆర్ పెండింగ్‌లో ఉంది. అలాగే, 2024-25 ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 69,820 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని అధికారులు సేకరించి మిల్లర్లకు అందజేయగా ఇందులో 47,457 క్వింటాళ్ల సీఎంఆర్ పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు. అయితే, రైస్ మిల్లర్లు పౌర సరఫరాల శాఖ అందించిన వరి ధాన్యాన్ని ఇప్పటికే బహిరంగ మార్కెట్‌కు దారి మళ్లించి విక్రయించడంతో వారి దగ్గర నిల్వ లేకుండా పోయిందంటున్నారు. ఈ పరిస్థితుల్లో దళారుల నెట్‌వర్క్ ద్వారా నేరుగా రేషన్ షాపుల నుంచే తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి తిరిగి ప్రభుత్వానికి సీఎంఆర్ రూపంలో అంటగట్టే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఈ తరహాలోనే రేషన్ బియ్యాన్ని రైస్ మిల్లుల్లో అక్రమంగా నిల్వ ఉంచగా పక్కా సమాచారం అందడంతో అధికారులు దాడులు చేసి మూడు రైస్ మిల్లులపై కేసులు నమోదు చేశారు. తాజాగా శుక్రవారం కూడా చిట్యాల, రేగొండ మండలాల్లో 97 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడటం గమనార్హం. ఈ బియ్యం కూడా ఓ రైస్ మిల్లుకు చెందిన గోదాంకు నిల్వ చేసేందుకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు సమాచారం. గత ఏడాది మార్చి నుంచి ఇప్పటి వరకు భూపాలపల్లి జిల్లాలో 2,532 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని 52 కేసులు నమోదు చేసి 82 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో నలగురిపై పీడీయాక్టు కూడా ప్రయోగించినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది.

రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి పూజలు



పూజలు చేస్తున్న నిర్వాహకులు

కాటారం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధన్వాడ గ్రామంలో గౌడ కులస్థుల ఆరాధ్యదైవమైన రేణుకాఎల్లమ్మ నూతన ఆలయ నిర్మాణంలో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో వేదపండితులు కృష్ణమోహన్‌శర్మ దర్వాజ నిర్మాణం, వాస్తు బంధనం పూజలు చేశారు. త్వరలోనే ఆలయ నిర్మాణం పూర్తిచేసుకుని అమ్మవారి ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు మారగోని రాజబాబుగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రేణుకా ఎల్లమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు మార్క రవీందర్, బుర్రి సుధాకర్, కారెంగల వెంకట్రాజం, గణపతి, అంజయ్య, మహేష్, వెంకన్న, మారగోని సంతోష్, గౌడ కులపెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

రోడ్డును ప్రారంభించాలి : బీజేపీ

మల్హర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : తాడిచర్ల-భూపాలపల్లి రోడ్డు పనులను ప్రారంభించాలని బీజేపీ మండల అధ్యక్షుడు బండ శ్రీకాంత్ పటేల్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీఆర్ఆర్ నిధుల్లో కూడా మిగతా మండలాల కన్నా తక్కువ కేటాయించినట్లు ఆరోపించారు. మండల ప్రజలను కేవలం ఓటు బ్యాంకు రూపంగానే వాడుకుంటున్నారని విమర్శించారు. తాడిచర్ల-భూపాలపల్లి రోడ్డు నిర్మాణం పూర్తయితే రవాణా సౌలభ్యం పెరిగి అనేక మందికి ఉపాధి అవకాశాలకు మార్గం సుగమమం అవుతుందని తెలిపారు. వెంటనే రోడ్డు పనులను ప్రారంభించాలని, లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

టేకుమట్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన నీదిగొండ సధాకర్ తన మొబైల్ ఫోన్ ఇటీవల పోగొట్టుకోగా పోలీసులు అతడికి ఆదివారం అప్పగించారు. సధాకర్ ఇటీవల తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకొని రికవరీ కోసం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. సీఈఐఆర్ యాప్‌తో లోకేషన్ ట్రేస్ చేసి ఫోన్ రికవరీ చేసినట్లు చెప్పారు. ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నట్లయితే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

కాటారం డివిజన్‌లో రోడ్లు, డ్రెయిన్లకు రూ.16.145 కోట్ల నిధులు

కాటారం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కాటారం డివిజన్‌లోని ఐదు మండలాలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నిధులు మంజూరు చేయించారు. పలు అభివృద్ధి పనుల కోసం రూ.16కోట్ల 14 లక్షల 50 వేలు విడుదలయ్యాయి. కాటారం, మల్హర్, మహాముత్తారం, మహాదేవపూర్, పలిమెల మండలాల్లోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం కోసం సీఆర్ఆర్-ఎస్‌సీపీ (కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ రోడ్స్-స్పెషల్ కాంపోనెంట్ ప్రోగ్రాం) నిధులు రూ.5.375 కోట్లు, బీటీ రోడ్ల మరమ్మతులు, పునరుద్ధరణ కోసం ఎంఆర్ఆర్ (మెయింటెనెన్స్ ఆఫ్‌రూరల్ రోడ్స్) నిధులు రూ.10.77 కోట్లు మంజూరయ్యాయి. కాటారం మండలంలోని 27గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి రూ.1.90 కోట్లు, మహాముత్తారం మండలంలోని 21గ్రామాలకు రూ.1.40 కోట్లు, మహదేవపూర్ మండలంలోని 17 గ్రామాలకు రూ.1.05 కోట్లు, మల్హర్ మండలంలోని 14 గ్రామాలకు రూ.72 లక్షలు, పలిమెల మండలంలోని ఐదు గ్రామాలకు రూ.30 లక్షలు మంజూరయ్యాయి. బీటీ రోడ్ల మరమ్మతులు, పునరుద్ధరణ కోసం ఎంఆర్ఆర్ గ్రాంట్ కింద రూ.10.77కోట్లు మంజూరయ్యాయి. కాటారం మండలంలోని పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి జగ్గయ్య పల్లి రూ.2.62 కోట్లు, జడ్పీ రోడ్డు నుంచి వీరాపూర్‌కు రూ.65 లక్షలు, బోడపల్లికి రూ.35లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి జగ్గయ్యపల్లికి రూ.1.03 కోట్లు, మల్హర్ మండలంలో కొయ్యూరు నుంచి కుంభంపల్లికి రూ.1.41కోట్లు, చిన్నతూండ్ల నుంచి పెద్ద తూండ్లకు రూ.1.02 కోట్లు, జడ్పీ రోడ్డు నాచారం నుంచి తాడ్వాయి వరకు రూ.65లక్షలు, మహాముత్తారం మండలంలో జడ్పీ రోడ్డు మీనాజీపేట నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు రూ.1.89కోట్లు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి స్తంభంపల్లి (పీపీ)కి రూ.1.03 కోట్లు, జడ్పీ రోడ్డు నుంచి మహబూబ్‌పల్లి వరకు రూ.1.32 కోట్లు, మహదేవపూర్ మండలంలో పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి బెగ్లూరు వరకు రూ.83 లక్షలు విడుదలయ్యాయి. రోడ్ల అభివృద్ధి పనుల కోసం భారీగా నిధులు మంజూరు కావడంపై కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పోశమ్మ గుడి వద్ద నిర్వాహకురాలి నిరసన



నిరసన తెలుపుతున్న సాంబలక్ష్మి

భూపాలపల్లిటౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): భూపా లపల్లి పట్టణం లోని ప్రధాన రోడ్డుపై గలపోశమ్మ గుడి వద్ద నిర్వాహకురాలు గోప రాజు సాంబలక్ష్మి ఆందో ళనకు దిగారు. తాను ఏర్పాటు చేసుకున్న గుడిని తనకే ఇవ్వాలని నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో హనుమాన్ దేవాలయం సమీపంలో పోశ మ్మ గుడిని గోపరాజు సాంబలక్ష్మి 30ఏళ్ల క్రితం ఏర్పాటు చేసుకున్నారు. ఈగుడిపై వచ్చిన కొద్దిపాటి ఆదాయంతో ఆమె జీవనం గడుపుతున్నారు. ఈ క్రమంలో సంఘం పేరుతో కొంతమంది దుండగులు వచ్చి తనపై దాడికి దిగి దౌర్జన్యంగా గుడి సేవలను అడ్డుకున్నారని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలో తాను నాలుగు నెలల నుంచి ఎలాంటి పనిలేక, డబ్బులు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. తన గుడిని లాక్కోవడం మూలంగా తన కుటుంబం రోడ్డున పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తన గుడిని తానే నిర్వహించుకునేలా కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు.